క్లుప్తంగా

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పామూరు: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామూరు ఎస్సై టి.కిషోర్‌బాబు, సీఎస్‌పురం ఎస్సైలు ఆర్.సుమన్‌సూచించారు. చెరువులు, కాల్వలు, వాగులు, కుంటల్లోకి నీరుచేరుతున్నందున దసరా సెలవులకు ఇళ్లకు వచ్చిన విద్యార్థులు, ముఖ్యంగా చిన్నపిల్లలు వాగులు, కుంటలు, వంకలు, చెరువుల వైపు పోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు, పశువులు విద్యుత్ స్థంభాలకు దూరంగా ఉండేలా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఏదైనా ఘటన చోటుచేసుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సైలు కోరారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



తహసీల్దార్ తో మాట్లాడుతున్న ఆర్డీఓ

వీసీపల్లి: తుఫాన్ పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉండేలా చూడాలని కనిగిరి ఆర్డీఓ కె.కేశవర్ధన్రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయానికి మంగళవారం వచ్చిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. తుపాన్ పట్ల రైతులను, ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ఉషను ఆదేశించారు. వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి పంట నష్టం వివరాలను అంచనా వేయాలన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



హ్యాండ్‌వాష్‌పై వివరిస్తున్న మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): చేతులు పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని కనిగిరి డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సీఎస్‌పురం గ్రామ సచివాలయంవద్ద అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ చేతులను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే తినే ఆహారం ద్వారా క్రిములు ఉదరంలోకి పోయి నులిపురుగులు ఏర్పడి తద్వారా రక్తహీనతకు గురవడంతో పాటు పలురకాల వ్యాధులకు గురవుతారన్నారు. ఏపీఓ వాక్యవతి, పీఎస్‌లు వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



నందనవనంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

హనుమంతునిపాడు: మండల పరిధి తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ పరిధి ఎలికవారిపల్లి కంభం రోడ్డుకు తార్ రోడ్డు నిర్మాణాకి ,నందనవనం పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. అదే విధంగా నందనవనం పంపచాయతీలో రూ.35 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఎంపీపీ గాయం సావిత్రి, ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఏపీఓ వెంకటేశ్వర్లు, మాజీ రైతు సంఘ నాయకులు కుందురు నారాయణరెడ్డి, ఎంపీటీసీలు ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, సూరిశెట్టి నారాయణస్వామి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించాలి



రావులకొల్లులో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణచైతన్య

పొన్నలూరు: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో అంటు వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణచైతన్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని రావులకొల్లు, ఉప్పలదిన్నె గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ఆరోగ్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు ప్రజలకు అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు తగు ఆరోగ్య సూత్రాలు పాటించే విధంగా ఆరోగ్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకకుండా పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. త్వరలో మండలంలోని ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు.

పట్టించుకోకుంటే ప్రమాదమే..!



నరశింహాశ్రేష్టి అదితి సెంటర్‌లో గుంతలమయంగా ఉన్న రోడ్డు



సింగరాయకొండ-మార్కెట్ సెంటర్ లో రోడ్డు పైన, రోడ్డు పక్కన నిలిచిన నీరు

- మెయిన్ రోడ్డులో గుంతలతో వాహనదారుల ఇక్కట్లు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో వర్షం నీరు గుంతల్లో నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా నరశింహాశ్రేష్టి అదితి సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్, మార్కెట్ సెంటర్, గ్రంథాలయం సెంటర్, సాయిబాబా గుడి సెంటర్‌లలో రోడ్డుపై నీరు నిలిచి భారీ గుంథలు పడ్డాయి. దీనికి తోడు ఇటీవల మంత్రి స్వామి మండలానికి వచ్చిన సమయంలో రోడ్డుపై గుంతలతో పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి స్వామి వెంటనే ఆర్‌అండ్‌బీ ఏఈ మాధవరావును పిలిచి గుంతల సమస్య వెంటనే పరిష్కరించాలని, వర్షంనీరు రోడ్డుపై నిల్వకుండా కాలువల్లోకి వెళ్లేలా చేయాలని సూచించారు. మంత్రి స్వామి సూచనల ప్రకారం ఏఈ..కందుకూరు మండలానికి చెందిన కాంట్రాక్టర్‌ను గుంతలను పూడ్చే కార్యక్రమం ఉచితంగా చేయాలని చెప్పి ఒప్పించారు. దీంతో నాలుగు రోజుల క్రితం సదరు కాంట్రాక్టర్ జేసీబీ తీసుకుని వచ్చి పంచాయతీ, పోలీసు సహకారంతో రోడ్డు మార్జిన్‌లోని దుకాణాలను తొలగించి రోడ్డు మార్జిన్లో ఉన్న మట్టిని తొలగించి వర్షం నీరు కాలువలోకి వెళ్లేలా చేశారు. ఇందుకోసం రోడ్డు మార్జిన్లోని మట్టిని సరిచేసే క్రమంలో గుంతలు ఏర్పడ్డాయి. అయితే ఒకపూట పనిచేసిన తర్వాత దసరా పండుగ తర్వాత చేస్తానని చెప్పి వెళ్లిపోయాడు. దీనికి తోడు వర్షాలు కురవటంతో వర్షపు నీరు రోడ్డు పై నిలవటంతో పాటు రోడ్డు మార్జిన్లో చేసిన గుంతల్లో నిలబడి చినపాటి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షం నీరు నిలబడటంతో ఆ గుంతల్లో వాహనాలు పోవటంతో పడి గాయాలపాలవుతున్నారు. మార్కెట్ సెంటర్, సాయిబాబా గుడి సెంటర్ లో వాహనదారులు పడి గాయాలపాలయ్యారని ప్రజలు తెలియజేస్తున్నారు. అంతేగాక ప్రజలు రోడ్డు ప్రక్కన దుకాణాల్లోకి వెళ్లాలంటేనే ఎక్కడ నీళ్లలో జారిపడతామోనని అటు వెళ్లటానికి భయపడుతున్నారు. పండుగ సమయంలో ఈ విధంగా గుంతలు చేయడం వలన వ్యాపారాలు దెబ్బతిన్నాయని వ్యాపారులు వాపోతుండగా, వర్షాలు పడతాయని తెలిసి ఈ విధంగా రోడ్డు గుంతలు చేయడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికయినా అధికారులు స్పందించి వర్షం నీరు రోడ్డు పై నిలబడకుండా తగు చర్యలు తీసుకోవటంతో పాటు గుంతలు పూడ్చి ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్

యువత కలాం బాటలో నడవాలి

కనిగిరి రూరల్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కలాం చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ తమ్మినేని సుజాత రెడ్డి, దేవకి రాజీవ్, పిచ్చిరెడ్డి, అరుణోధర్, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, ఏఈ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్ తదితరులు ల్గొన్నారు.

పామూరు: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాటలో నడవాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, ప్రజాసంఘాల నాయకుడు జొన్నలగడ్డ గోవిందయ్య అన్నారు. డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతిని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్.నాయబ్‌రసూల్, బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరాం శ్రీను, పైడాల వెంకటరెడ్డి, కోడూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పామూరులో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

వరిసాగులో మెళకువలు పాటించాలి



సీఎస్‌పురంలో పైరును పరిశీలించి సూచనలిస్తున్న ఏడీఏ వెంకటరమణ



గుమ్మనంపాడులో మినుము పైరును పరిశీలిస్తున్న ఏఓ రాధ



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

సీఎస్‌పురం(పామూరు): రైతులు వరి, ఆముదం సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎ.వెంకటరమణ అన్నారు. సీఎస్‌పురం, మండలంలోని బోయమడుగుల పంచాయతీల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా సీఎస్‌పురంలో వరిసాగు, బోయమడుగులలో ఆముదం సాగు పంటలను ఆయన పరిశీలించి రైతులకు సాగులో మెళకువలు, వాటిని ఆశించే తెగుళ్ల గురించి తెలిపి నివారణ చర్యలు వివరించారు.

పామూరు: భారీ వర్షాల నేపథ్యంలో మినుము రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని గుమ్మనంపాడు గ్రామానికి చెందిన 10 మంది రైతులు నల్లరేగడి పొలాల్లో సుమారు 270 ఎకరాల్లో సాగు చేసిన మినుము పంటను మంగళవారం ఆమె పరిశీలించారు. నీటి నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. అనుములకొండ, నుచ్చుపొద గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

వెలిగండ్ల: అధిక వర్షాల నుంచి సాగు చేసిన పంటలను వ్యవసాయాధికారుల సూచనలు పాటించి రైతులు కాపాడుకోవాలని వ్యవసాయాధికారి ఎస్ రంగకృష్ణ అన్నారు. మండలంలోని కంకణంపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది నిర్వహించారు. కంది, సజ్జ పంటలలో వర్షపు నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి, పశువైద్యాధికారి, రైతులు పాల్గొన్నారు.

టంగుటూరు: మినుము సాగు చేసిన రైతులు వర్షాలకు పొలాల్లో నీరు నిలిస్తే ఎకరానికి 30 కేజీల యూరియా చల్లుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత సూచించారు. మండలంలోని మర్లపాడు, కందులూరు గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఉద్యానశాఖాధికారి తేజ మాట్లాడుతూ కూరగాయలు సాగు చేసే రైతులకు వంగ, బీర, పుచ్చ నారు ఉచితంగా, టమోటా నారు సాహు రకం మొక్క రూ.0.20 కుప్పం నుంచి సరఫరా చేస్తామన్నారు. సర్పంచులు పసుమర్తి ఈశ్వరమ్మ, తాళ్లూరి ఆశీర్వాదం, దామచర్ల బసవయ్య, ఉప్పలపాటి రామరాజు పాల్గొన్నారు.

కొండపి: రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని చెరువ చేసేందుకు పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి డి.విజయ్కుమార్ అన్నారు. మండలంలోని పెరిదేపి, ముప్పరాజుపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు శనగ విత్తనాలను 25 శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఏపీఎంఐపీ శాఖలో డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నకళ్లగుంటలో కంది, మిరప పంటలను పరిశీలించారు. వర్షాల కారణంగా తెగులు సోకకుండా రైతులకు సూచనలు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె. శ్రీకాంత్, మహేష్, టి. వెంకటనారాయణ, ఏఈఓ తేజస్విని, పశు సంవర్ధక సహాయకులు టి.నాగరాజు, రైతులు పాల్గొన్నారు.



అనుముల కొండలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ రాధ



కంకణంపాడులో మాట్లాడుతున్న ఏఓ రంగకృష్ణ



కందులూరులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి స్వర్ణలత

ఎడతెరపి లేని నాన్పుడు వర్షం

కనిగిరి రూరల్: నియోజకవర్గంలో మూడు రోజులుగా ఎడతెరపి లేని నాన్పుడు వర్షం కురుస్తోంది. పట్టణ శివారు ప్రాంతాలన్నీ చిత్తడిమయంగా మారాయి. ప్రధాన పట్టణంలో కాలువల్లో నీరు బయటకు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విలీన గ్రామాల్లోని రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రజలు నడకకు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

పంటలు కళ కళ..

కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాగు వేసిన పంటలు వర్షాలకు కళకళలాడుతున్నాయి. ఆరు మండలాల్లో వ్యవసాయ సాధారణ విస్తీర్ణం 20,928 హెకార్టు కాగా, ఇప్పటి వరకు 17,627 హెక్టార్లు సాగు చేశారు. ఉద్యాన పంటలు సాధారణ విస్తీర్ణం 2,449 హెక్టార్లు కాగా 2 వేల హెక్టార్ల వరకు సాగు చేశారు. సబ్ డివిజన్‌లో ప్రధానంగా కంది, వరి, సజ్జ, పొగాకు, మినుము తదితర పైర్లు వేశారు. అధికారిక లెక్కల ప్రకారం కంది 15,487 హెక్టార్లు, వరి 500 హెక్టార్లు, సజ్జ 1,496 హెక్టార్లు, పొగాకు 400 హెక్టార్లు, మినుము 700 హెక్టార్లు, ఇతర పంటలు 200 హెక్టార్ల వరకు పడినట్లు అధికారులు వెల్లడించారు. గత రెండ్రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కంది, వరి, మినుము పంటలు మంచి మేలు చేయనుంది. పొగనాట్లు మరింత జోరందుకున్నాయి. ఒక్క సజ్జ పంటకు మాత్రం కొంతమేర ఇబ్బంది కల్గుతుంది. కోత దశకు వచ్చిన సజ్జకు ఈ వర్షం వల్ల కొంత మేర నష్టం వాటిళ్లే ప్రమాదం ఉంది. వర్షం ముసురు మరో రెండ్రోజులు కొన సాగితే సజ్జ గింజలు రాలి, రంగు పోయి తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం కనిగిరి మండలంలో 45.0 మి.మీ, వెలిగండ్ల 43.2, హెచ్ఎంపాడు 37.0, పామూరు 80.4, సీఎస్‌పురంలో 48.8, పీసీపల్లిలో 54.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.




జోరుగా పొగ నాట్లు

తహసీల్దార్ కార్యాలయానికి వర్షం దెబ్బ



కార్యాలయంపై మొలిచిన చెట్టు



శ్లాబు పెచ్చులు ఊడి పడుతున్న కార్యాలయం

- వర్షానికి తడిసిన రికార్డులు
- వర్షానికి పెచ్చులూడిపడుతున్న శ్లాబు
- భయం భయంగా విధుల నిర్వహణ

పీసీపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వర్షానికి తడిసి ముద్దయింది. కార్యాలయంలోకి నీరు కారడంతో విలువైన రికార్డులు తడిసిపోయినట్లు తెలిసింది. దీనికి తోడు శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండటంతో తహసీల్దార్ నుంచి సిబ్బంది వరకు అందరూ బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది. పురాతన కాలం నాటి భవనం కావడంతో భవనంపై నీరు నిలిచి అక్కడక్కడ కారుతోంది. కార్యాలయంపై పిచ్చి చెట్లు పెద్ద సంఖ్యలో మొలిచి గోడలు నెర్రెలుపారాయి. కార్యాలయానికి కనీస మరమ్మతులు చేయకపోవడంతో వర్షాల సమయంలో సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



కార్యాలయ ఆవరణలో వర్షంనీరు

అధ్వాన రోడ్లతో అవస్థలు

పీసీపల్లి: మండల కేంద్రమైన పీసీపల్లిలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పంచాయతీరోడ్డు, వైఎస్సార్ సెంటర్ నుంచి ఎన్‌టీఆర్ సెంటర్ మీదుగా మండల పరిషత్ వరకు పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా తయారైంది. కొద్దిపాటి వర్షానికే రోడ్లు తటాకాలను తలపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగునీరు చేరింది. దీంతో దోమలు వ్యాపించి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



మురుగు కుంటలను తలపిస్తున్న ప్రధాన రహదారి

పొంగి పొర్లుతున్న వాగులు



పైరెడ్డిపాలెంలో వర్షపు నీటితో కళకళలాడుతున్న చెక్‌డ్యాం



అగ్రహారం బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

పొన్నలూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో పొన్నలూరు మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరపి లేని వర్షం కురుస్తుంది. దీంతో గ్రామాల్లోని చెక్‌డ్యాంలు, కుంటలు, వాగులన్నీ జలకళను సంతరించుకున్నాయి. వాగులు, కుంటలు, చెక్‌డ్యాంల్లోకి వర్షపు నీరు చేరడంతో పంటల సాగుకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం మెట్ట పైర్లుకు బాగా ఉపయోగపడుతుందని అన్నదాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి కూడా సమస్య ఉండదని ప్రజలు సంతోష పడుతున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండటంతో గ్రామాల్లోని చెరువుల్లోకి కూడా పూర్తిస్థాయిలో నీళ్ల చేరి వ్యవసాయానికి అనువుగా ఉంటుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ సుజాత పాలేరు నదిని పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో మంగళవారం 6.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



మూసి వాగు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్, సిబ్బంది

కొండపి: మండలంలో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం మండలంలో 86 హెక్టార్లు మిరప, 453 హెక్టార్లలో కంది పంట ఉన్నట్లు వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు.పంటలకు ఏ విధమైన నష్టం వాటిల్ల లేదని పేర్కొన్నారు.



ఉప్పలదిన్నె వద్ద పాలేరును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

వెలిగండ్ల: మండలంలోని అగ్రహారం గ్రామంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో బస్టాండ్ సెంటర్‌లో వర్షం నీరు నిలిచింది. గ్రామంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సైడు కాల్వలు లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయాయి.

భూముల పరిశీలన త్వరితగతిన పూర్తిచేయాలి

హనుమంతునిపాడు: ఫ్రీఓల్డ్ అసైన్డ్ భూముల పరిశీలన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ కె.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులు రూంను పరిశీలించారు. అనంతరం ఫ్రీఓల్డ్ భూములు రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ పంచాయతీల వారీగా రికార్డులు సక్రమంగా క్రమపద్ధతిలో ఉంచాలన్నారు. కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ పంచాయతీల వారిగా ఫ్రీఓల్డ్ పరిశీలన సంబంధించిన పనులు పెండింగ్ లేకుండా చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలిన సూచించారు. ఫ్రీఓల్డ్ భూములు పరిశీలించి తప్పిదాలు లేకుండా సర్వే చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీటీ కె.కిషోర్‌రెడ్డి, సర్వేయర్ రమణయ్య, కార్యాలయ సిబ్బంది షేక్ రసూల్, సైదులు, వీఆర్వోలు ఉన్నారు.



రికార్డు రూంను పరిశీలిస్తున్న ఆర్డీఓ

30 మందికి వైద్య పరీక్షలు

వలేటివారిపాలెం: మండలంలోని బడేవారిపాలెం గ్రామంలో ఇంటింటికీ వైద్యం కార్యక్రమం వలేటివారిపాలెం వైద్యాధికారి డాక్టర్ మణి దీపిక మంగళవారం నిర్వహించారు. బడేవారిపాలెం గ్రామంలో 30 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులను పరీక్షించి రక్తం తక్కువగా ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి వృద్ధులకు, వికలాంగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఏఎన్ఎంల ద్వారా ప్రతి వారం పరీక్షలు చేయించుకోవాలని, అలాగే ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు. కాన్పుల అనంతరం 108 ద్వారా తల్లి బిడ్డను ఇంటి దగ్గరకు చేర్చిన అనంతరం ప్రభుత్వం తల్లికి 1000 రుపాయలు ఇస్తుందని తెలిపారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వృత్తి పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎన్ఎం పద్మ, ఆశ వర్కర్లు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.